సాక్షి ఒడిశా

మంగళవారం । 24 । జనవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,14,811లు, బంగారం 4.79 గ్రాములు, వెండి 39.4 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



యువతకు ఆదర్శం.. నేతాజీ

- 8లో



అప్రమత్తతపై నిఘా

- 8లో

న్యూస్‌రీల్

చిత్రకొండ సమితిలో బీఎస్ఎఫ్ శిబిరం



మహిళలకు దుస్తులు అందిస్తున్న బీఎస్ఎఫ్ అధికారులు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా జాన్‌బాయి పంచాయతీలో బీఎస్ఎఫ్ 88 బెటాలియన్ జవాన్లు జనసంపర్క్ శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు రేడియోలు, టార్చ్‌లైట్, దుప్పట్లు, మహిళలకు చీరలు, ఇతర నిత్యావసర సామగ్రి పంపిణీ చేశారు. బెటాలియన్ కమాండార్ వినోద్ సోరేన్, మల్కన్‌గిరి డీజీ శుధాంజన్ మహాపాత్రో, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈ ప్రాంత గిరిజనులకు ఎప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

గల్లంతైన గిరిజనుడి మృతి



జలాశయం ఒడ్డున మంగులి పంగి మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ జలాశయంలో చేపల వేటకు వెళ్లి, గల్లంతైన గిరిజనుడు శవమై తేలాడు. పేపరమెట్ల పంచాయతీకి చెందిన మంగుల పంగి(46) ఆదివారం తెల్లవారుజామున తన భార్యతో కలిసి జలాశయంలో చేపట వేటకు నాటు పడవలో వెళ్లారు. కొంతసేపటికి పడవ బోల్తా పడిపోవడంతో మంగుల గల్లంతయ్యాడు. భార్య ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకొని, పేపరమెట్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే చిత్రకొండ అగ్నిమాపక కేంద్రానికి తెలియజేయగా, సిబ్బంది అక్కడికి చేరుకొని గాలించారు. ఎట్టకేలకు సోమవారం తెల్లవారి మృతదేహం లభ్యమైంది. దీనిపై చిత్రకొండ పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

హతురాలు కొత్తపల్లి మహిళ

- ఒడిశా సరిహద్దులో గుర్తు తెలియని మృతదేహం వివరాలు లభ్యం
- అనకాపల్లికి చెందిన వ్యక్తి హత్య చేసినట్లు సమాచారం



ఒడిశాలో హత్యకు గురైన ఆకురాతి వరలక్ష్మి(46)

కశింకోట: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన మహిళ ఒడిశాలో దారుణ హత్యకు గురైనట్లు తెలియడం సోమవారం కలకలం రేపింది. ఆంధ్ర–ఒడిశా సరిహద్దులో రెండు రోజుల క్రితం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన విషయం విదితమే. చిత్రకొండ సమితి దొరగూడ–పప్పులూర్ ప్రధాన రహదారిలో అనుమానాస్పదంగా మృతి చెంది ఉండటంతో పోలీసులకు సమాచారం అందజేశారు. ఈ నేపథ్యంలో అనకాపల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి నేరాన్ని అంగీకరిస్తూ సోమవారం అనకాపల్లి పోలీసులకు లొంగిపోవడంతో బాధితురాలి ఉదంతం వెలుగు చూసింది. మరింత సమాచారం కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపల్లికి చెందిన ఆకురాతి వరలక్ష్మి(46)కి అనకాపల్లి మండలం మాకవరం గ్రామానికి చెందిన వ్యక్తితో పరిచయం ఉంది. శ్రీకాకుళం తీసుకు వెళ్తానని చెప్పి ఈనెల 20న ఒడిశా–ఆంధ్ర సరిహద్దులోని చిత్రకొండ పోలీసు స్టేషన్ పరిధి కాకరపాడు వద్ద మారుమూల ప్రాంతానికి ఆమెను తీసుకువెళ్లిన నిందితుడు గొంతు కోసి దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో నిందితుడు సోమవారం అనకాపల్లి పట్టణ పోలీసు స్టేషన్‌లో నేరాన్ని అంగీకరిస్తూ లొంగిపోయినట్టు సమాచారం. ఘటనపై అనకాపల్లి పట్టణ ఎస్ఐ సత్యనారాయణను సంప్రదించగా పూర్తిగా విచారణ జరపాల్సి ఉందన్నారు. ఈ ఘటన గురించి తెలియడంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులను ఆశ్రయించి ఒడిశా నుంచి హతురాలి మృతదేహాన్ని తీసుకు రావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. హత్యకు పాల్పడడానికి గల కారణాలు గురించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. హతురాలికి ఇద్దరు కుమారులున్నారు.

మురిసిన ఉత్సవం





నృత్య ప్రదర్శనలో కళాకారులు

- ఘనంగా ముగిసిన చొయితి, పల్లిశ్రీ ఉత్సవాలు
- హాజరైన రాష్ట్రమంత్రులు ప్రమీలా, టుకిని, సరక
- సందడి చేసిన సినీతారలు
- ఆకట్టుకున్న కళాకారుల నృత్యాలు

రాయగడ: జిల్లా కేంద్రంలోని గోవిందచంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 18 నుంచి కొనసాగుతున్న చొయితి ఉత్సవాలు ఆదివారం రాత్రి ముగిసాయి. ముగింపు ఉత్సవాల్లో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ప్రమీలా మల్లిక్, గిరిజన, జలవనరుల శాఖ మంత్రి టుకిని సాహు, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రమీలా మల్లిక్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం మహిళాభ్యున్నతికి విస్తృత కృషి చేస్తోందని తెలిపారు. వారు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించేందుకు ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వివిధ సంక్షేమ పథకాలు సత్ఫలితాలిస్తున్నాయని పేర్కొన్నారు. మిషన్‌శక్తి వంటివి వారి ఆర్థిక సాధికారితకు ఎంతగానో దోహద పడుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ మహిళల కోసం తీసుకుంటున్న శ్రద్ధ అభిందనీయమని వివరించారు. ఆదివాసీల అభివృద్ధి నిమిత్తం అటవీ భూముల పట్టాల పంపిణీ కార్యక్రమం ఇప్పటికే ప్రారంభమైందన్నారు.

జిల్లాల విభజనతో..

దివంగత ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ రాష్ట్రాన్ని అభివృద్ధి పరిచేందుకు 13జిల్లాలను 30 జిల్లాలుగా చేశారని మంత్రి మల్లిక్ తెలిపారు. జిల్లాల విభజనతోనే అభివృద్ధి సాధ్యమని భావించిన ఆయన కళలను సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి నవీన్ ఆదిశగా తన వ్యూహాలు రచిస్తున్నారని పేర్కొన్నారు. రాయగడ పట్టణం గత పదేళ్లలో గణనీయమైన అభివృద్ధి చెందిందన్నారు. స్థానిక జైపూర్ షుగర్ కంపెనీకి చెందిన 506 ఎకరాల స్థలం ప్రభుత్వం హస్తగతం చేసుకోవడంతో అభివృద్ధి పరిచేందుకు మార్గం సుగమైందని తెలిపారు. ప్రజలు ఎప్పటి నుంచో ఆశిస్తున్న మెడికల్ కళాశాల వంటి బృహత్తర ప్రజాహిత అభివృద్ధి కార్యక్రమాలకు ఇకపై శ్రీకారం చుట్టే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయని ఆకాంక్షించారు.



వేదికపై కలెక్టర్, ఎస్‌డీసీ చైర్మన్ నృత్యాలు



కళాకారులను సన్మానిస్తున్న మంత్రి టుకుని సాహు

వసతుల కల్పనలో ముందంజ

ప్రజల ఆర్థిక వికాసంతో పాటు వారికి కనీస మౌలిక సౌకర్యాలు కల్పించే విషయంలో ప్రభుత్వం అగ్రగామిగా ఉందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి టుకుని సాహు అన్నారు. చొయితి ముంగింపు ఉత్సవాలకు గౌరవ అతిథిగా పాల్గొన్న ఆమె వ్యవసాయపరంగా రాష్ట్రం ఎంతో ప్రగతి సాధించిందని తెలిపారు. మంత్రి జగన్నాథ సరక మాట్లాడుతూ దేశంలో సనాతన ధర్మానికి అధిక ప్రాధాన్యస్తున్న నేపథ్యంలో ఆయా ఆచారాలను మనమంతా గౌరవించాలని ఆకాంక్షించారు. భిన్న సంస్కృతులు, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించి జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు.

ఆకట్టుకున్న లేజర్ షో..

చొయితి ముగింపు ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లేజర్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సుమారు 15 నిమిషాలు నిర్వహించిన ప్రదర్శనలో భారతీయ సంస్కృతి, సనాతన ధర్మాన్ని ప్రతిబింబించే విధంగా లేజర్ లైట్ల ద్వారా ప్రేక్షకుల కళ్లకు కట్టినట్లు చూపించారు. అలాగే పట్టణానికి చెందిన మహిళలు ప్రదర్శించిన అష్టలక్ష్మీ వైభవం నాట్య ప్రదర్శన, లోక్‌నృత్యాలు, ఒలీవుడ్ హీరోయిన్ అర్పిత సాహు నృత్యాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి.

ఎస్‌డీసీ చైర్మన్, కలెక్టర్ నృత్యాలు

ఉత్సవాలు ముగింపు సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, ఎస్‌డీసీ చైర్మన్ అనసూయ మాఝి వేదికపై ఆదివాసీ పాటలకు నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. అదేవిధంగా జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ, ఇతర అధికారులు ఆనందంతో గంతులేశారు. 5రోజుల ఉత్సవాలు ఘనవిజయం సాధించాయని, ప్రజల నుంచి మంచి స్పందన లభించడం ఎంతో ఆనందన్నిస్తోందని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రదర్శనలో స్థానిక ఉద్యానవన విభాగం ఏర్పాటు చేసిన స్టాల్ ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. అనంతరం ఉత్తమ ప్రదర్శనలకు ఆయా కళాకారుల బృందాలకు సన్మానించారు. ముగింపు ఉత్సవాలకు వేలాదిగా జనం హాజరయ్యారు.

ఉర్రూతలూగించిన ప్రదర్శనలు



ప్రేక్షకులను అలరిస్తున్న అర్చనా మిశ్రా, సవ్యసాచి సాహు



రాయగడ జిల్లా కళాకారుల డొంగ్రియా నృత్యం

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని స్టేడియంలో జరిగిన గజపతి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పల్లిశ్రీ ఉత్సవాలు సందడిగా ముగిసాయి. జిల్లావ్యాప్తంగా వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయగా, దక్షిణాంచల్(బరంపురం) పోలీసు కమిషనర్ సత్యభ్రత భొయి, కలెక్టర్ లింగరాజ్ పండా, ఏడీఎం సంగ్రాంశేఖర పండా, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) ప్రదీప్‌కుమార్ నాయక్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ముఖ్య అభివృద్ధి అధికారి రమాంచల్ ఖమారీ, ఐటీడీఏ పీఓ ఫాల్గుణీ మాఝి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ఒడియా చలనచిత్ర నటులు అర్చనామిశ్రా, సవ్యసాచి సాహు యాంకర్లుగా వ్యవహరించడమే కాకుండా తమ డ్యాన్సులతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఇందులో భాగంగా మున్సిపల్ స్వీపర్స్ ఉద్యోగుల సంఘం, చంద్రగిరి టిబెటియన్ గ్రూప్, కళింగ వైశ్య మహిళా సంఘం కోలాటం, రాయగడ జిల్లా డొంగ్రియా లోకనృత్యం, చంద్రగిరి ఏకలవ్య ఆదర్శ రెసిడెన్సియల్ విద్యాలయం, సర్గిపులో ఆదివాసీ నృత్యం, సంబల్‌పురి లోకనృత్యం, గజపతి ప్రెస్ క్లబ్ మీడియా ప్రతినిధుల డ్యాన్సులు హుషారెత్తించాయి. అలాగే కళాకారులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలతో అధికారులు సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్ వద్ద కొనుగోలుదారులు ఎగబడ్డారు.



నృత్య బృందాలను సన్మానిస్తున్న మంత్రి జగన్నాథ సరక



పర్లాకిమిడి: దేశభక్తి గేయానికి మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది నృత్యం



పర్లాకిమిడి: ఉత్సవాల్లో దక్షిణాంచల్ పోలీస్ కమిషనర్ సత్యభద్ర భొయి, కలెక్టర్

ఓస్డమాకు ఆపద ప్రబంధన్ పురస్కారం

- ప్రకటించిన కేంద్రప్రభుత్వం
- విపత్తు నిర్వహణలో చేసిన కృషికి ప్రశంసలు

భువనేశ్వర్: దేశవ్యాప్తంగా విపత్తు నిర్వహణకు చేసిన కృషికి ప్రదానం చేసే ప్రతిష్టాత్మకమైన సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్–2023 ఈ ఏడాది ఒడిశా స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ(ఓఎస్‌డీఎంఏ) సాధించింది. ఈ మేరకు కేంద్రప్రభుత్వం సోమవారం ప్రకటన విడుదల చేసింది. విపత్తు నిర్వహణ సంస్థాగత విభాగంలో ఒడిశా రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ, మిజోరాంలోని లుంగ్లీ అగ్నిమాపక కేంద్రం(ఎల్ఎఫ్) ఉమ్మడిగా ఈ పురస్కారాన్ని గెలుచుకున్నాయి. విపత్తు నిర్వహణ రంగంలో దేశవ్యాప్తంగా వ్యక్తులు, సంస్థలు అందించిన సహకారం.. నిస్వార్థ సేవలను గుర్తించి, గౌరవ సూచనగా కేంద్రప్రభుత్వం ఈ వార్షిక అవార్డును అందిస్తోంది. నేతాజీ సుభాష్‌చంద్ర బోస్ జయంతి సందర్భంగా ఏటా జనవరి 23న ఈ అవార్డు విజేతలను ప్రకటిస్తారు. ఈ అవార్డు కింద ఉన్నత విపత్తు నిర్వాహకులకు రూ.5 లక్షల నగదు బహుమతితో ప్రసంశాపత్రం, సంస్థలకు రూ.51 లక్షల నగదు అందజేస్తారు. ఈ ప్రోత్సాహంతో ఇటీవల కాలంలో జాతీయ స్థాయిలో విపత్తు నిర్వహణ పద్ధతులు, సంసిద్ధత, ఉపశమన, ప్రతిస్పందన విధానాలు గణనీయంగా మెరుగు పడ్డాయి. ఈ అవార్డు కోసం 2022 జూలై 1న జారీచేసిన నోటిఫికేషన్‌తో 274 ప్రతిపాదనలు దాఖలయ్యాయి. సూపర్ సైక్లోన్ తర్వాత 1999లో స్థాపించబడిన ఒడిశా స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ(ఓస్డమా) విపత్తు నిర్వహణలో అగ్రగామి సంస్థగా వెలుగొందుతోంది. దీని ఆధ్వర్యంలో ఒడిశా డిజాస్టర్ రాపిడ్ యాక్షన్ ఫోర్స్(ఒడ్రాఫ్), మల్టీ హజార్డ్ ఎర్లీ వార్నింగ్ సర్వీస్(ఎంహెచ్ఈడబ్ల్యూ) వంటి బహుళ కార్యక్రమాలను ప్రారంభించారు.

సతర్క్ సేవలు..

విపత్తు కదలిక, తీవ్రత పట్ల అప్రమత్తం చేయడం కోసం సతర్క్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వెబ్/స్మార్ట్ ఫోన్ ఆధారిత ప్లాట్ ఫారం(డైనమిక్ రిస్క్ నాలెడ్జ్ ఆధారంగా విపత్తు ప్రమాద సమాచారాన్ని సతర్క్ అంచనా వేస్తుంది. రాష్ట్రంలో సంభవించిన పలు తుపాను, వరదలు వంటి ప్రకతి వైపరిత్యాల్లో కీలక పాత్ర పోషించింది. 2014లో సంభవించిన హుద్‌హుద్ తుపాను, 2019లో ఫణి, అంఫాన్(2020), ఒడిశా వరదలు (2020) సమయంలో ఓస్డమా సమర్థవంతమైన నిర్వహణ ప్రాణహాని గణనీయంగా నివారించింది. 381 సునామీ పీడిత గ్రామాలు, వార్డులు, తీరప్రాంతం నుంచి 1.5 కిలో మీటర్ల దూరంలో 879 బహుళ ప్రయోజన తుఫాను/వరద షెల్టర్లు, కమ్యూనిటీ కేంద్రాల పునరుద్ధరణతో ఓస్డమా విపత్తు సంసిద్ధత కార్యక్రమాలను నిరవధికంగా నిర్వహిస్తోంది.

బరాముండా బస్టాండ్‌లో దగ్ధమైన బస్సు

భువనేశ్వర్: నగరంలోని బరాముండా బస్టాండ్‌లో నిలిచిన ప్రైవేటు బస్సు ఖండాధర్ క్వీన్ బస్సు మంటల్లో చిక్కుకుని దగ్ధమైంది. సోమవారం ఉదయం బస్సు నుంచి అకస్మాతుగా మంటలు చెలరేగడంతో ఈ ఘటన సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకొని, మంటలను అదుపు చేశారు. అగ్నిమంటలు రేగిన పరిస్థితిని ప్రేరేపించిన కారణాలు తెలియాల్సి ఉందని అగ్నిమాపక అధికార వర్గం తెలిపింది.



బస్సు నుంచి ఎగిసి పడుతున్న మంటలు

24వేల గంజాయి మొక్కలు ధ్వంసం



కొరాపుట్: పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు



గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న అధికారులు

బరంపురం: అవిభక్త కొందమాల్–గంజాం జిల్లాల సరిహద్దు సన్నోఖెముండి బ్లాక్ గంగాపూర్ పోలీసు స్టేషన్ పరిధి అటవీ ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఎక్సైజ్, అటవీశాఖ అధికారులు సోమవారం వరుస దాడులు నిర్వహించారు. పర్వత ప్రాంతాల్లో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి పంటను గుర్తించి, 24వేల మొక్కలను తొలగించారు. పంటకు నిప్పంటించి, ధ్వంసం చేశారు.

మాచ్‌ఖండ్‌లో 187 కిలోలు.

కొరాపుట్: జిల్లాలోని మాచ్‌ఖండ్ పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. లమతాపుట్ సమితి గొడిఅంజల్ పంచాయతీ బంస్రిగొడి గ్రామ సమీపంలో గంజాయి రవాణా జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపులు చేపట్టగా, అటుగా వస్తున్న దుండగులు వాహనాన్ని వదిలి, తప్పించుకున్నారు. అందులో 187 కిలోల గంజాయి పట్టుబడగా, మేజిస్ట్రేట్ సమక్షంలో సీజ్ చేశారు. మచ్‌ఖండ్ ఓఐసీ డొంబ్రుదర్ బత్రియా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

అప్రమత్తతపై నిఘా

● ఖుర్దారోడ్‌లో రైల్వే సిబ్బంది మాక్‌డ్రిల్



దుర్ఘటన రైలు బోగీ నుంచి బాధితులను సురక్షితంగా బయటకు తీస్తున్న దృశ్యం



చికిత్స శిబిరానికి బాధితుల తరలింపు

భువనేశ్వర్: తూర్పుకోస్తా రైల్వే ఖుర్దారోడ్ డివిజన్‌లో సిబ్బంది అప్రమత్తత పర్యవేక్షణకు విపత్తు నిర్వహణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. రైలు నిర్వహణలో నిరంతర అప్రమత్తత నివారణకు తొలి సోపానం. ఈ నేపథ్యంలో సిబ్బందిని చైతన్య పరిచేందుకు ఖుర్దారోడ్ సీనియర్ మండల భద్రత అధికారి(ఎస్‌డీఎస్‌ఓ) ఎంఎస్‌ఎస్ రమేష్ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. తపాంగ్ రైల్వే స్టేషన్‌లో యాత్రికుల ప్రత్యేక రైలు దుర్ఘటనకు గురైనట్లు సైరన్‌లు మోగించి సిబ్బందిని పరుగులు తీయించారు. ఆకస్మిక దుర్ఘటనల నిర్వహణ పట్ల తక్షణ కార్యాచరణ అవగాహన కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ సన్నివేశం సహజమైన రైలు దుర్ఘటన భయానక పరిస్థితులను తలపింపజేసింది. దుర్ఘటన పాలైన రైలు బోగీల్లో చిక్కుకున్న ప్రయాణికులను సురక్షితంగా కాపాడి, తక్షణ చికిత్సతో సత్వర సహాయక చర్యలతో బంధు వర్గాలకు తాజా సమాచారం ప్రసారం చేయడంతో బాధితులకు తక్షణ పరిహారం వంటి కార్యకలాపాలను ఘటనా స్థలంలో ప్రదర్శించారు. ఈ దృశ్యాలతో పరిసరాల్లో స్థానికులు రైలు దుర్ఘటన భావనతో ఉలికిపాటుకు గురయ్యారు. పలు వర్గాల విపత్తు నిర్వహణ, సహాయక, పునరుద్ధరణ వర్గాలతో రైల్వే వైద్య, వాణిజ్య ఇతరేతర విభాగాల ఉన్నతాధికారులతో సిబ్బంది పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లో మన ఎమ్మెల్సీలు

నెల్లిమర్ల: న్యూఢిల్లీలో సోమవారం ప్రారంభమైన జాతీయ విధాన వర్క్‌షాప్‌లో ఎమ్మెల్సీలు డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు (సురేష్ బాబు), ఇందుకూరి రఘురాజు పాల్గొన్నారు. పీఆర్‌ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో 'రాష్ట్రాల ఆర్థిక వనరులు' అనే అంశంపై రెండ్రోజుల పాటు జరగనున్న సదస్సుకు హాజరయ్యారు. మొదటి రోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో పన్నుల రాబడి, వాటాల కేటాయింపుపై ఆర్థిక వేత్తలు వివరించినట్లు ఎమ్మెల్సీలు స్థానిక విలేకరులకు ఫోన్‌లో తెలిపారు. రెవెన్యూ లోటు కింద కేంద్రం అందించే సహాయం, స్థానిక సంస్థల పన్నులు, విపత్తుల నిర్వహణ గ్రాంట్లు, పెట్టుబడి ఖర్చులు, రుణాల తిరుగు చెల్లింపులు, రెవెన్యూ ఖర్చులు, స్థానిక సంస్థలకు అందించే నిధులు తదితర అంశాలను వివరించారన్నారు.

హెచ్‌ఎం తీరుపై దిశ డీఎస్పీ దర్యాప్తు

సంతకవిటి: మండలంలోని అప్పలఅగ్రహారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో దిశ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు సోమవారం దర్యాప్తు చేశారు. పాఠశాలకు చెందిన ఓ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలో హెచ్‌ఎంపై సంతకవిటి ఎస్‌ఐ జనార్దనరావు కేసు నమోదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తుల నుంచి డీఎస్పీ వివరాలు సేకరించారు. పంచాయతీ సర్పంచ్ దవళ సీతమ్మ, గ్రామ పెద్ద దవళ నర్సింహమూర్తి, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీరామమూర్తి, ఎంఈఓ బి.శాంతికుమారి తదితరులతో మాట్లాడారు. నిందితుడిని అరెస్టుచేసి రాజాం కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్‌ఐ తెలిపారు.

31న జిల్లా సమీక్ష సమావేశం

విజయనగరం అర్బన్: జిల్లా సమీక్ష సమావేశం ఈ నెల 31న స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అధ్యక్షతన జరగనుందని కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో ధాన్యం సేకరణ, గృహనిర్మాణం, వైద్యం, ఆరోగ్యం, తాగు నీటి సరఫరా, సంక్షేమ పథకాలు, డీఆర్‌డీఏ, వ్యవసాయం, పశుసంవర్ధకశాఖ, మహిళా శిశు సంక్షేమం, ఉపాధిహామీ, జలవనరులు, విద్య, గడపగడపకు మన ప్రభుత్వం తదితర అంశాలపై చర్చిస్తారని పేర్కొన్నారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

విజయనగరం అర్బన్: ఐఐటీ, ఎన్‌ఐటీ వంటి ప్రతిష్ఠాత్మక ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు చేపట్టే జేఈఈ మెయిన్స్ ఆన్‌లైన్ పరీక్ష షెడ్యూల్ విడుదయింది. ప్రతి రోజూ ఉదయం , మధ్యాహ్నం రెండు షిఫ్టులుగా నిర్వహించే ఈ పరీక్ష మంగళవారం నుంచి వచ్చేనెల 1వ తేదీ వరకు కొనసాగనుంది. జిల్లాలో దరఖాస్తు చేసుకున్న 3,135 మంది కోసం గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఐయాన్ డిజిటల్ జోన్, డెంకాడ మండలం చింతలవలసలోని ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఒక్కో పూట 225 మంది విద్యార్థులు మించకుండా పరీక్ష నిర్వహించనున్నారు.
తొలి రోజు నుంచి చివరరోజు వరకు ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 2,530 మంది, ఈ నెల 28, 29 తేదీలలో ఐయాన్ డిజిటల్ జోన్‌లో 605 మంది పరీక్ష రాయనున్నారు.



బరంపురం: నేతాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ చంద్రశేఖర్, ఎమ్మెల్యే విక్రమ్ పండా, మేయర్ సంఘమిత్ర తదితరులు



భువనేశ్వర్ పూరీ సాగర తీరంలో సుదర్శన్ పట్నాయక్ రూపొందించిన సైకత శిల్పం



పర్లాకిమిడి: కోర్యండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రామరాజు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు

యువతకు ఆదర్శం.. నేతాజీ

● ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి
● పూలమాలలు వేసి, నివాళులర్పించిన అధికారులు, నాయకులు

స్వాతంత్ర్య సాధనలో దేశ యువతను ముందుండి నడిపించిన సుభాష్ చంద్రబోస్ ఆదర్శ ప్రాయుడని వక్తలు కొనియాడారు. నేతాజీ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని వివిధ పాఠశాలలు, బహిరంగ వేదికల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సేవలను గుర్తు చేసుకున్నారు. - సాక్షి నెట్‌వర్క్

బరంపురం: నగరంలోని పీవీఎస్ రావు పెట్రోల్ ట్యాంక్ జంక్షన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్‌పండా, నగర మేయర్ సంఘమిత్ర దొళాయి, బీఎంసీ కార్పొరేటర్లు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.
జయపురం: పట్టణంలోని లక్ష్మీ ఇందిరా పండా కూడలి వద్ద నుంచి విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు ర్యాలీ నిర్వహించారు. నేతాజీ సహచర పోరాట యోధురాలు లక్ష్మీ పండా విగ్రహం నుంచి పలు వీధుల మీదుగా పాదయాత్ర సాగగా, మహాత్మాగాంధీ రోడ్డులోని సుభాష్‌చంద్ర బోస్ విగ్రహం వద్దకు చేరుకొని, పూలమాలలు వేసి నివాళులర్పించారు.
కొరాపుట్: పట్టణంలోని గుండిచా మందిరం ఎదుట ఉన్న నేతాజీ విగ్రహానికి ఉమ్మర్‌కోట్ ఎమ్మెల్యే నిత్యానంద గొండో జిల్లా బీజేపీ నాయకులతో కలిసి వచ్చి, పూలమాలలు వేశారు. కొరాపుట్ మున్సిపల్ చైర్మన్ లలాటేందు రంజన్‌సౌరి, మున్సిపల్ మాజీ చైర్మన్ భగవాన్ బహినీపతి, కాంగ్రెస్ నాయకుడు రుపక్ తురుక్, బీజేడీ నాయకులు నివాళులర్పించారు. నవరంగ్‌పూర్ లోని మెయిన్ రోడ్డులో స్వాతంత్ర్య పోరాట వీరుల స్మారక స్థూపం వద్ద నేతాజీ విగ్రహానికి కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా, ఏడీఎం భాస్కర్ రైతా పూలమాలలు వేశారు.
రాయగడ: స్థానిక రాణిగుడ ఫారంలోని ఆజాద్ హింద్ అసోసియేషన్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సుభాష్‌చంద్ర బోస్ విగ్రహాన్ని రాజ్యసభ మాజీ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ డీకే మహంతి, జిల్లా పరిషత్ సభ్యులు సంధ్యా పులక తదితరులు పాల్గొన్నారు. క్లబ్ అధ్యక్షుడు ప్రదీప్, ఉపాధ్యక్షుడు నీలమణి పటజోషి, బినాయక్ ఖర్ పాల్గొన్నారు.
మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని సుభాష్ కూడలి వద్ద ఉన్న నేతాజీ విగ్రహానికి కలెక్టర్ పూలమాలాలు వేసి, నివాళులర్పించారు. సుభాష్ క్లబ్ సభ్య జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కొరాపుట్: నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ లలాటేందు, భగవాన్ బహినీపతి



బరంపురం: నేతాజీ సుభాష్‌చంద్ర బోస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రతినిధులు



భువనేశ్వర్: నివాళులర్పిస్తున్న గవర్నర్ గణేషీలాల్

పర్లాకిమిడి: బెత్తగుడ కేంద్రియ విద్యాలయంలో విద్యార్థులకు పెయింటింగ్, వ్యాసరచన పోటీలు జరిగాయి. కేవీజీ(గజపతి), జవహర్ నవోదయ, సెంచూరియన్ పబ్లిక్ స్కూల్, ఒడిశా ఆదర్శ విద్యాలయ సంఘటన్, గుమ్మా, రాయఘడ, లింగిపురం, ఖరడ తదితర 21 పాఠశాలల నుంచి 80మంది విద్యార్థులు పాల్గొన్నారని విద్యాలయం కో-ఆర్డినేటర్ ముకేష్‌చంద్ర రాణా తెలిపారు.



జయపురం: రాజనగర్ కూడలి వద్ద పాటలు పాడుతున్న విద్యార్థినులు



జయపురం: ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు



కొరాపుట్: నివాళులర్పిస్తున్న నవరంగ్‌పూర్ కలెక్టర్ కమలోచన్ మిశ్రా

నేతాజీకి ఘన నివాళి



నేతాజీ జన్మస్థలం ఆవరణలో పుష్పాంజలి ఘటిస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ 126వ జయంతి పురస్కరించుకుని రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పుష్పాంజలితో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోమవారం కటక్ ఒడియా బజార్‌లోని నేతాజీ జన్మస్థలాన్ని వారివురూ సందర్శించారు. ఈ ప్రాంగణంలో మ్యూజియం సందర్శించి నేతాజీ చిత్రపటానికి పూలమాల వేశారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి, చిత్ర కళా ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులతో మాట్లాడారు. పలువురు ఎమ్మెల్యేలు, మేయర్ సుభాష్ సింగ్, మున్సిపల్, పోలీసు కమిషనర్లు హాజరయ్యారు. అలాగే పూరీ సాగరతీరంలో అంతర్జాతీయ సైకతశిల్పి పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ విభిన్న శైలిలో శ్రద్ధాంజలి ఘటించారు. నేతాజీ జై హింద్ నినాదంతో రూపొందించిన సైకత శిల్పానికి 450 స్టీల్ గిన్నెలతో ప్రత్యేకంగా అలంకరించి చూపరులను విశేషంగా ఆకట్టుకున్నారు.



మల్కన్‌గిరి: నేతాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ విశాల్‌సింగ్



రాయగడ: నేతాజీ విగ్రహావిష్కరణలో పాల్గొన్న నెక్కంటి, మహంతి తదితరులు



రాయగడ: పట్టణంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థుల ర్యాలీ



పర్లాకిమిడి: కేంద్రియ విద్యాలయంలో డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థులు

నేడే శంబర పోలమాంబ..

సిరిమాను సంబరం

● 3 లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం
● ఉత్తరాంధ్రలో పలు ప్రాంతాల నుంచి 120 ఆర్టీసీ బస్సులు
● జాతర ఏర్పాట్లను విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ పరిశీలన
● 700 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు



సంబరానికి సిద్ధమైన సిరిమాను (ఇన్‌సెట్లో) శంబర పోలమాంబ అమ్మవారు

సాక్షి ప్రతినిధి, విజయనగరం/మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, గిరిజనుల ముద్దుబిడ్డ శంబర పోలమాంబ అమ్మవారి సిరిమాను సంబరాన్ని మంగళవారం అంబరాన్ని అంటేలా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. గత రెండేళ్లు కరోనా మహమ్మారి కారణంగా విధించిన ఆంక్షలు ఈసారి తొలగిపోయాయి. దీంతో సిరిమాను సంబరాన్ని తిలకించేందుకు ఉత్తరాంధ్ర నుంచే గాకుండా తెలంగాణా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చే అవకాశం ఉంది. దాదాపు 3 లక్షల మంది వరకూ రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లు చేశారు. మంగళవారం మధ్యాహ్నం రెండున్నర, మూడు గంటల సమయంలో సిరిమాను ఊరేగింపు ప్రారంభించేందుకు అధికారులు, గ్రామపెద్దలు చర్యలు చేపడుతున్నారు. గతేడాది సిరిమాను పొడవు 36 అడుగులు కాగా ఈ సారి 39 అడుగుల పొడవున తయారుచేశారు. దీన్ని సిరిమానోత్సవానికి సిద్ధం చేశారు. పూజారి రామారావు అధిరోహించనున్నారు.

సిరిమాను విశిష్టత ఇలా...
అమ్మవారు శక్తి స్వరూపిణి. కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి. పూజారి రూపంలో శంబర గ్రామంలోని పురవీధుల్లో సిరిమాను రథంపై నుంచి భక్తులకు దర్శనమిస్తారు. దీంతో భక్తులు పూజారికి అరటిపళ్లు, కొబ్బరికాయలు, చీరలు చూపించి మొక్కుబడులు చెల్లించుకుంటారు. విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ, అదనపు ఎస్పీ డాక్టర్ దిలీప్‌కిరణ్, ఆర్డీఓ హేమలత సోమవారం శంబరలో జాతర ఏర్పాట్లును పరిశీలించారు. సిరిమాను తిరిగే పురవీధులను, గుడి వద్ద క్యూలైన్లను పరిశీలించారు.

తరలివచ్చే భక్తులకు సౌకర్యాలు...
పోలమాంబ అమ్మవారి సిరిమానోత్సవం తిలకించేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి దాదాపు 150 ఆర్టీసీ బస్సులను అధికారులు నడుపుతున్నారు. సాలూరు వైపు నుంచి వచ్చే బస్సులను వనంగుడి వద్ద, పార్వతీపురం, బొబ్బిలి వైపు నుంచి వచ్చే బస్సులను జెడ్పీ హైస్కూల్ ఆవరణలో పార్కింగ్ చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఆలయ కార్య నిర్వాహక అధికారి వి.రాధాకృష్ణ, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు పరిశీలించారు. వనంగుడి వద్దనున్న అమ్మవారిని దర్శించుకొనేందుకు వచ్చే భక్తులకు ఇబ్బందుల్లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ప్రత్యేక దర్శనం, శీఘ్రదర్శనం, ఉచిత దర్శనం ఉంటాయి. 15 వేల లడ్డూలను, పులిహోర ప్రసాదాన్ని తయారు చేశారు. భక్తులకు సేవలందించేందుకు 90 మంది దేవదాయశాఖ సిబ్బంది, సుమారు వంద మంది సేవాసంఘాల ప్రతినిధులు జాతరలో విధులు నిర్వహించనున్నారు. చదురుగుడి సమీపంలో రెండు, వనంగుడి వద్ద ఒకటి ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటుచేశారు. పుణ్యస్నానాల తర్వాత భక్తులు వస్త్రాలను మార్చిడి చేసుకోవడానికి వీలుగా గదులు, తాత్కాలిక మరుగుదొడ్లను అందుబాటులో ఉంచుతున్నారు. వీధుల్లో వ్యర్థ పదార్థాలను వెనువెంటనే శుభ్రం చేయించేందుకు 75 మంది పారిశుద్ధ్య కార్మికులను నియమించారు. పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు మున్సిపాల్టీల నుంచి 45 మంది, పంచాయతీ నుంచి 30 మంది కార్మికులు పనిచేస్తున్నారు.

కంట్రోల్‌రూమ్‌ల ఏర్పాటు..
చదురుగుడి క్యూలైన్లు వద్ద, రామమందిరం వద్ద కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేశారు. వాటిలో రెవెన్యూ, పోలీస్, వైద్యం, పంచాయతీరాజ్, ట్రాన్స్‌కో అధికారులు ఉంటారు. చదురుగుడి క్యూలైన్ల వద్ద, అంగన్‌వాడీ కేంద్రం, పీహెచ్‌సీ, వనంగుడి, రామాలయం వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటుచేశారు. తొమ్మిది మంది వైద్యాధికారులు, 30 మంది వైద్యసిబ్బంది అక్కడ విధినిర్వహణలో ఉంటారు. రెండు 108లు, 104 వాహనం, ఐదు ఫీడర్ అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచారు. అగ్నిమాపక శకటాలను చదురుగుడి ఆలయం వెనుక, క్యూలైన్ వద్ద ఉంచుతున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ట్రాన్స్‌కో ఏఈ శాంతారావు పర్యవేక్షిస్తున్నారు.

శంబర చేరుకోవచ్చు ఇలా...

● మక్కువ నుంచి కవిరిపల్లి మీదుగా శంబరకు చేరుకోవాలంటే 6 కిలోమీటర్లు దూరం ప్రయాణించాలి. ● సాలూరు నుంచి మక్కువ మీదుగా 25 కిలోమీటర్లు దూరం ఉంటుంది. ● పార్వతీపురం నుంచి తాళ్లబురిడి మీదుగా శంబర చేరుకోవాలంటే 47 కిలోమీటర్లు ప్రయాణం చేయాలి.
● పార్వతీపురం నుంచి చినబోగిలి మీదుగా శంబర చేరుకోవాలంటే 38 కిలోమీటర్లు ప్రయాణించాలి.

కన్నులపండువగా తొలేళ్ల సంబరం

● అమ్మవారిని దర్శించుకున్న భక్తలోకం
● ఉదయం నుంచి ప్రత్యేక పూజలు
● అమ్మవారి సేవలో డీఐజీ హరికృష్ణ
● జాతరలో సీఆర్‌పీఎఫ్ బలగాల పహారా



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారి సేవలో ఆర్డీఓ హేమలత



క్యూలను పరిశీలిస్తున్న డీఐజీ హరికృష్ణ



పోలీస్ బందోబస్తును అడిషనల్ ఎస్పీకు వివరిస్తున్న సీఐ

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సోమవారం కన్నులపండువగా సాగింది. అమ్మవారి ఘటాలను ఆదివారం రాత్రి తిరువీధి జరిపిన అనంతరం శంబర ప్రధాన వీధిలో అమ్మవారి గద్దెవద్ద ఘటాలను ఉంచి, కారుగేద వాలకాలను నిర్వహించారు. మహిషాసురిణి, పోతురాజు వేషధారణ ప్రదర్శన డప్పువాయిద్యాలతో సాగింది. గ్రామానికి చెందిన రైతులు ఉపవాసాలతో ఉండి ఏరుత్సోవం నిర్వహించారు. గ్రామపెద్దలంతా ఏరోత్సవానికి జన్ని, గిరడ కుటుంబాలను ఆహ్వానించారు. జన్ని, గిరిడవారి ఇంటివద్ద నుంచి తెచ్చిన విత్తనాలను అమ్మవారి ముందు ఉంచి పూజలు చేశారు. అమ్మవారి అక్షితలను పశువు లేర్లపై జల్లి పూజలు నిర్వహించారు. అనంతరం రైతులు తలోపిడికెడు విత్తనాలను ఇంటికి తీసుకెళ్లారు. వీటిని పంట పొలంలో సాగుచేసే విత్తనాల్లో కలిపి విత్తడం వల్ల పంటలు కలిసివస్తాయని, పంటలు బాగా పండేలా తల్లి ఆశీర్వాదం అందుతుందని రైతుల నమ్మకం. తొలేళ్ల ఉత్సవం అడిషనల్ ఎస్పీ డాక్టర్ దిలీప్‌కిరణ్, ఆర్డీఓ హేమలత, డీఎస్పీ ఎ.సుభాష్ , ఈఓ వి.రాధాకృష్ణ, ట్రస్టుబోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు పర్యవేక్షణలో సాగింది. తొలేళ్ల ఉత్సవానికి గత ఏడాది కంటే భక్తుల రద్దీ తగ్గింది. భక్తులు ప్రధానాలయంలో ఉన్న అమ్మవారిని, వనంగడి వద్ద నున్న పెదపోలమాంబను దర్శించుకున్నారు. వనంగుడి వెనుకన ఉన్న వేపచెట్టుకు పూజలు చేశారు. తలనీలాలు సమర్పించారు. చీరలు, కోళ్లు చూపించి మొక్కుబడులు చెల్లించారు. డీఎస్పీ సుభాష్, సీఐ ధనుంజయ రావు ఆధ్వర్యంలో పోలీస్ బలగాలు బందోబస్తు విధులు నిర్వహించాయి.

30 తులాలు వెండి వడ్డానం బహూకరణ
విజయనగరం పట్టణంలోని కె.ఎల్.పురానికి చెందిన పున్నాన రామునాయుడు, రమాదేవి దంపతులు శంబర పోలమాంబ అమ్మవారికి 30 తులాలు వెండి వడ్డానాన్ని, పట్టుచీర, చారె సామాన్లను సోమవారం సమర్పించారు. ఈఓ వి.రాధాకృష్ణ, దేవదాయశాఖ సిబ్బంది మురళీనాయుడుకు వెండి వడ్డానాన్ని అందివ్వగా, అమ్మవారికి అలంకరించారు. శంబర పోలమాంబ అమ్మవారిని విశాఖపట్టణం రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ దర్శించుకున్నారు. జాతరలో ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా, పటిష్టబందోబస్తు నిర్వహించాలని అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్‌కు డీఐజీ సూచించారు.

క్లుప్తంగా

మూడో స్నాతకోత్సవం నిర్వహణకు చర్యలు



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాయం మూడో స్నాతకోత్సవం నిర్వహణకు చర్యలు చేపడుతున్నట్లు రిజిస్ట్రార్ సీహెచ్ ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు. వర్సిటీ లోని రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. స్నాతకోత్సవం నిర్వహణకు పాలక మండలి అనుమతి తీసుకున్నామని, రాష్ట్ర గవర్నర్ అనుమతి కోరినట్లు చెప్పారు. ఆయన సూచనల మేరకు స్నాతకోత్సవ నిర్వహణ తేదీ ప్రకటిస్తామని అన్నారు. వర్సిటీలో ఇంజినీరింగ్ 5, 7 సెమిస్టర్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి ఆరు వరకు ఈ పరీక్షలు జరుగుతాయని అన్నారు. వర్సిటీలో అకడమిక్ క్లాసవర్క్‌పై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ఫేస్ రికగ్నేషన్ సిస్టం వర్సిటీ, వర్సిటీ అఫిలియేషన్ కళాశాలల్లో విద్యార్థులకు, బోధర, బోధనేతర సిబ్బందికి అమలు చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో విద్యార్థులకు చెల్లించే జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలు అమలు సైతం ఎఫ్ఆర్ఎస్ ఆధారంగా చెల్లించనున్నట్లు వివరించారు.

బాలికపై రేప్ కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలు శిక్ష

శ్రీకాకుళం పాతబస్టాండ్: బాలికపై లైంగికదాడికి పాల్పడిన కేసులో దోషులైన ఇద్దరికి 20 ఏళ్ల చొప్పున జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. జి.సిగడాం మండలానికి చెందిన లుట్ట అనిల్ కుమార్ (ఎ1), పమోటి రవికుమార్ (ఎ2)లకు జైలు శిక్షతో పాటు బాలికకు పరిహారం కింద ఒకటో ముద్దాయికి రూ.లక్ష, రెండో ముద్దాయికి రూ.2 లక్షలు జరిమానా విధించింది. శ్రీకాకుళం ప్రత్యేక ట్రిబునల్ కోర్టు, పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.శ్రీదేవి సోమవారం ఈ తీర్పునిచ్చారు. 2020 డిసెంబర్‌లో వీరిపై జి.సిగడాం మండలం భీమవరం గ్రామానికి చెందిన ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికను భయపెట్టి లొంగదీసుకున్నారని, గర్భవతిని కూడా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆపై వారి నేరం రుజువు కావడంతో జడ్జి పైన పేర్కొన్న విధంగా తీర్పునిచ్చారు. ఈ కేసును దిశ డీఎస్పీ వాసుదేవ్ దర్యాప్తు చేయగా, ప్రభుత్వ న్యాయవాది పి.వెంకటరమణారావు వాదించారు.

జాతీయ స్థాయి పోటీలకు నందిగాం విద్యార్థులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో నందిగాం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

నందిగాం: శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజీ మైదానంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో నందిగాం ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హర్నాగుల హరిబాబు తెలిపారు. పాఠశాలకు చెందిన జి.అభిరాం, అండర్ 14 బాలుర విభాగంలో 400, 600 మీటర్ల పరుగుపందెంలో రెండు బంగారు పతకాలు, రిలే పోటీలో వెండి పతకం సాధించగా, బి.మోక్ష అండర్ 17 విభాగంలో 1500, 3000 మీటర్ల పరుగు పందెంలో రెండు బంగారు పతకాలు సాధించారు. దీంతో విద్యార్థులతో పాటు పీడీ శ్రీనివాసరావును, కోచ్ బి.వెంకటరావును ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందించారు.

కలెక్టర్‌కు రూ.25 లక్షల చెక్కు అందజేత

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత అభియాన్ కింద డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వారు జిల్లాలో 595 మంది టీబీ వ్యాధిగ్రస్తుల ఫుడ్ బాస్కెట్ కోసం నెలకు రూ.700చొప్పున ఆరు నెలల పాటు అందించేందుకు రూ.25 లక్షల చెక్కును జిల్లా టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ అనురాధ కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కు స్పందన కార్యక్రమంలో అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.సురేష్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్, జిల్లా పరిషత్ సీఈఓ వెంకట్ రామన్, నీటియాజమాన్య సంస్థ పథక సంచాలకులు జీవీ చిట్టిరాజు జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, డీఎస్ఓ వెంకట రమణ, సహాయ సంచాలకులు వ్యవసాయ శాఖ శ్రీధర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. .



గూడు అల్లెను చూడు స్పైడర్ తన ఇల్లు కట్టుకోవడంలో ఇలా బిజీగా ఉంది. తొలి సూర్యకిరణాలు తాకే సమయంలో తులసి చెట్టుపై ఇలా పర్ఫెక్ట్ ప్లాన్‌తో తన గూడును నిర్మించుకుంటోంది. – ఆమదాలవలస రూరల్

రంగం ఏదైనా.. బాలికే ఏలిక!

• పలు రంగాల్లో రాణిస్తున్న బాలికలు • నేడు జాతీయ బాలికా దినోత్సవం

అడుగు తీసి అడుగు వేస్తే సవాలక్ష ఆంక్షలు. 'గర్భ' గుడి దాటింది మొదలు.. అడుగడుగునా సంకెళ్లు. అమ్మవారి అంశ అంటూనే గడప దాటనీయని మనస్తత్వాలు. లోకమంతా మనిషి తోలు కప్పుకున్న మృగాళ్లు.. ఇన్ని అవరోధాల నడుమ సిక్కోలు బాలిక సీతాకోకచిలుకలా స్వేచ్ఛగా విహరిస్తోంది. తల వంచుకుని తిరిగే స్థితిగతులను మార్చి తల్లిదండ్రులు తలెత్తి గర్వపడి చూసే స్థాయికి ఎదుగుతోంది. క్రీడలు, విద్య, సృజనాత్మకత వంటి రంగాల్లో మన బాలికలు భళా అనిపిస్తున్నారు. ఈ రోజుల్లో కూడా అడ్డుగోడల నడుమ ఘడియలు లెక్క పెడుతున్న వారికి ప్రపంచం మనదేనంటూ ధైర్యాన్నిస్తున్నారు.

– ఇచ్ఛాపురం రూరల్



సోంపేట: బాలికల దినోత్సవం సందర్భంగా సంస్కారభారతి విద్యార్థుల ప్రదర్శన

అడుగేస్తే అవార్డు..



భరత నాట్యం చేస్తున్న భవానీ

చిరు ప్రాయంలోనే నాట్య రంగంలో ప్రవేశించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది బాగ భవానీ. ఇచ్ఛాపురం మండలం అయ్యవారిపేటకు చెందిన భవానీ 13 ఏళ్ల వయసులో స్వేచ్ఛా నృత్య తరంగణి నాట్య శిక్షణాలయంలో కూచిపూడి, భరత నాట్యం, జానపద నృత్య పోటీల్లో పాల్గొని వందకు పైగా ప్రదర్శనలు ఇచ్చి శభాష్ అనిపించుకుంది. ప్రస్తుతం ఇంటర్ చదువుతున్న భవానీ 2018లో తమిళనాడు మధురైలో జరిగిన నృత్య పోటీల్లో 'నృత్య మీనాక్షి' అవార్డును పొందింది. 2022లో హైదరాబాద్‌లో అక్షయ సోషల్ కల్చరల్ అసోషియేషన్ వారు నిర్వహించిన పోటీలో 'నాట్య సరస్వతి' అవార్డును, 2022 డిసెంబర్ 10న శ్రీశైలంలో జరిగిన సంగీత కళ నృత్య సాంస్కృతిక పోటీలో పాల్గొని 'నంది అవార్డు'ను కైవసం చేసుకుంది. అలాగే 2022 డిసెంబర్‌లో వారణాసిలో జరిగిన 75వ అమృత్ మహోత్సవ్, ఉత్తర ప్రదేశ్‌లో జరిగిన నృత్య పోటీల్లో పాల్గొని ఏసీపీ ప్రవీణ్ కుమార్ చేతులు మీదుగా సిల్వర్ మెడల్, బహుమతులు గెల్చుకుంది. నృత్య తరంగణి అకాడమీ అధ్యక్షులు కె.గోవిందరావు, గురువు మంగి దివ్య సారధ్యంలో మరింత శిక్షణ తీసుకుంటోంది.



కొడితే పతకమే..



కరాటే భంగిమలో మాధవీశెట్టి

కరాటే వంటి పోటీల్లో బాలికలు కూడా బాలురతో సమానంగా పోటీ పడుతున్నారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు లక్ష్మీపురం మత్స్యకార గ్రామానికి చెందిన మాధవి శెట్టి ఈదుపురం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. మహిళలు అత్యవసర సమయంలో తమను తాము కాపాడుకోవడానికి, ఆత్మ రక్షణకు కరాటే విద్య ఎంతో ఉపయోగపడుతుందన్న తల్లిదండ్రుల మాటలకు ఫిదా అయిపోయిన మాధవి స్నేహితులు వారిస్తున్నప్పటికీ ఒడిశా పాటి సున్నాపురానికి చెందిన మాస్టర్ తాయ్ ప్రకాశ్ దగ్గర కరాటే నేర్చుకుంది. కటా విభాగంలో జాతీయ స్థాయిలో జూలై 2022లో ఒడిశా గిరిసోలలో జరిగిన సౌత్‌జోన్ ఎల్లో బెల్ట్ ఛాంపియన్‌షిప్ పోటీలో గోల్డ్ మెడల్ సాధించింది. 2022లో రాష్ట్రస్థాయిలో కరాటే అండ్ కుంగ్‌ఫూ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని బంగారు బహుమతి పొందింది. ఒడిశాలో జరిగిన 3వ ఇంటర్ డోజో కరాటే ఛాంపియన్-2022 సెప్టెంబర్‌లో జరిగిన పోటీలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచింది. విశాఖపట్నంలో జరిగిన సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్ షిప్-2022 పోటీలో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచింది.

ఆటో బోల్తా: 9 మంది విద్యార్థులకు గాయాలు



గాయపడిన సూర్య స్కూల్ విద్యార్థి



గాయపడిన ఆదర్శ పాఠశాల విద్యార్థి



గాయపడిన విద్యార్థులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రణస్థలం: మండలంలోని కొండములగాం సమీపంలో ఆటో బోల్తా పడి తొమ్మిది మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. జేఆర్ పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని ఆదర్శపాఠశాల, సూర్య ప్రైవేటు పాఠశాలలకు చెందిన ఏడుగురు విద్యార్థులు వెల్బురాయి గ్రామం నుంచి ఉదయం 8గంటల సమయంలో ఆటోలో బయల్దేరారు. బంటుపల్లి పంచాయతీలో గల నుడుకుదిపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు మధ్యలో ఎక్కారు. ఈ ఆటో కొండములగాం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దకు ఉదయం 8.45 నిమిషాల సమయంలో వచ్చే సరికి రెండు కుక్కలు అడ్డంగా రావడంతో ఆటో డ్రైవర్ సురేష్ సడన్ బ్రేక్ వేయడంతో బండి బోల్తా పడిపోయింది. వెంటనే స్థానికులు స్పందించి ఆటోలో ఇరుక్కున్న వారిని రక్షించి 108కు సమాచారం అందించారు. వారు వచ్చి క్షతగాత్రులను రణస్థలం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇందులో నలుగురు విద్యార్థులను మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులకు చిన్న చిన్న దెబ్బలే తగలడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. గాయపడిన వారిలో ఎం.వరుణ్ చౌదరి, శ్రావణి, ఎ.భైరవ్, గిరీష్‌తో పాటు మరో ఐదుగురు విద్యార్థులు ఉన్నారు. ఆదర్శ పాఠశాల విద్యార్థులు ముగ్గురు, సూర్య స్కూల్ విద్యార్థులు ఆరుగురు ఆటో ఉన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. గాయపడిన విద్యార్థులను వైఎస్సార్‌సీపీ నాయకులు సాయికుమార్, కెల్ల రామకృష్ణ, ప్రసాద్‌తో పాటు పలువురు నాయకులు పరామర్శించారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో శాశ్వత అన్నదాన పథకానికి నరసన్నపేటకు చెందిన వి.విజయకుమారి కుటుంబ సభ్యులు ఒక లక్ష ఐదు రూపాయలను విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. ఈ నెల 26వ తేదీ సాయంత్రంలోగా రూ. లక్ష లేదా అంతకుమించి విరాళాలు ఇచ్చిన వారికి డోనర్ పాస్‌లు అందజేస్తామని ప్రకటించారు

ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

మాకవరపాలెం (అనకాపల్లి జిల్లా) : బైక్ ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలు.. తూర్పుగోదావరి జిల్లా రాజోలు మండలం పొదలాడకు చెందిన లంకె తరుణ్‌బాబు, సింగిరెడ్డి దినేష్(విజయనగరం), రావాడ లోకేష్(శ్రీకాకుళం)లు మండలంలో ని తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాల లో బీటెక్ నాలుగో సంవత్సరం విద్యార్థులు. వీరంతా కళాశాల హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. అయితే ఆదివారం రాత్రి మోటారు సైకిల్‌పై నర్సీపట్నం వెళ్లిన వీరు తిరిగి వస్తుండగా రాచపల్లి జంక్షన్ సమీపంలో కామేశ్వరమ్మ ఆలయం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టారు. దీంతో తరుణ్‌బాబు అక్కడికక్కడే మృతి చెందగా, దినేష్ తీవ్రంగా, లోకేష్ స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అపస్మారక స్థితిలో ఉన్న దినేష్‌ను విశాఖ తరలించారు. ఈ సంఘటనలో బైక్ నుజ్జునుజ్జయింది. కొద్ది నిమిషాల వ్యవధిలోనే హాస్టల్‌కు చేరుకోవాల్సిన తరుణ్ మృతి చెందడంతో తోటి విద్యార్థులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.

యాంత్రీకరణపై రైతులకు అవగాహన అవసరం

• వ్యవసాయ శాస్త్రవేత్త జగన్నాథం

ఆమదాలవలస: వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ పి.వి.కె.జగన్నాథం అన్నారు. ఆ దిశగా రైతులను సన్నద్ధం చేయాల్సిన బాధ్యత వ్యవసాయశాఖ సిబ్బంది, కేవీకే శాస్త్రవేత్తలపై ఉందన్నారు. ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రంలో కోఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అధ్యక్షతన సోమవారం 41వ శాస్త్రీయ సలహా మండలి సమావేశం జరిగింది. తొలుత కేవీకేలో క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చెరుకు పంట, బెల్లం తయారీలో నాణ్యత కలిగిన నవీన్ రకాన్ని రైతులు వినియోగించేలా చూడాలన్నారు. యాంత్రీకరణపై రైతులకు శిక్షణ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. గుంటూరు అగ్రులాం డీడీ డాక్టర్ విశాలక్ష్మి మాట్లాడుతూ.. ఈ సంవత్సరం అంతర్జాతీయ తృణ ధాన్యాల సంవత్సరంగా గుర్తించినట్లు చెప్పారు. కొర్ర, రాగి, సజ్జలు, జొన్నలకు సంబంధించి నూతన వంగడాలను విస్తరింపజేయాలన్నారు. అటారి సాంకేతిక విస్తరణ ప్రధాన శాస్త్రవేత్త ఎ.ఆర్.రెడ్డి మాట్లాడుతూ.. కె.వి.కె. చేస్తున్న సాంకేతిక విస్తరణ రైతులలో ఎలాంటి ప్రభావం చూపిస్తుందో అధ్యయనం చేయాలన్నారు. శ్రీకాకుళం ఏడీఏ డాక్టర్ బి.రజని మాట్లాడుతూ.. ఈ ఏడాది అంతర్జాతీయ తృణధాన్యాల సంవత్సరం సందర్భంగా శ్రీకాకుళం వారు 200 సమూహాలలో రాగి విత్తనాలను సరఫరా చేసి తృణధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నారన్నారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్, శాస్త్రవేత్తలు గత ఏడాదిలో నిర్వహించిన కార్యక్రమాలు, ఈ ఏడాదిలో ఏం చేయాలనుకుంటున్నారో వివరించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన కార్యక్రమాల ప్రణాళికను సమావేశంలో ఆమోదించారు. వరిలో సమగ్ర సస్యరక్షణలో సారశక్తితో నడిచే దీపపు ఎర ప్రాముఖ్యత, చేప ఉత్పత్తులు, తాజాగా ఉంచేందుకు మార్కెట్‌స్థాయిలో తీసుకోవలసిన జాగ్రత్తలపై వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేయండి



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మధ్యవర్తిత్వ విధానంలో అవార్డులు పొసైన కేసుల (ఆర్బిటరేషన్ కేసులు)ను లోక్ అదాలత్‌లో రాజీ అయ్యేలా కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. కోర్టులోని న్యాయసదన్‌లో సోమవారం శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్, శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెట్ లీగల్ అధికారులు, స్టాండింగ్ కౌన్సిల్ మంచు జనార్దన్, వివిధ ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడారు. రాజీకి అనుకూలమున్న కేసులను ఫిబ్రవరి 11వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో రాజీ చేయడానికి అందరూ కృషి చేయాలన్నారు. ఆర్బిటేషన్ ద్వారా అవార్డులు పొసైన కేసులు లోక్ అదాలత్‌లో రాజీ అవ్వడానికి ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు. కేసుల రాజీకి కృషి చేస్తామని ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులు చెప్పారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



విధులు బహిష్కరించి బయటకు వస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయవాదులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను సోమవారం బహిష్కరించారు. కాకినాడలో ప్రాక్టీసులో ఉన్న న్యాయవాది పైడి అన్నపూర్ణ వ్యక్తిగత పనులపై స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా వంజంగి రాగా.. ముసుగు వేసుకున్న కొంతమంది ఆమెపై దాడికి పాల్పడడం తగదన్నారు. దీనికి నిరసనగా విధులు బహిష్కరించినట్టు న్యాయవాదులు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బెజ్జిపురం ఫాల్గుణరావు, సీనియర్ అడ్వకేట్లు జల్లు తిరుపతిరావు, పి.వి.రమణదయాల్, ప్రభుత్వ న్యాయవాది పి.వి.రమణారావు, కూన అన్నం నాయుడు, బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు అగూరి ఉమామహేశ్వరరావు, ఎస్.తవిటినాయుడు, ఎ.కృష్ణరాజు, ఎ.ఎస్.ఆర్.సూర్యకళ, శ్రీదేవి, మీరాబాయ్, సంధ్య, సుజాత ఉన్నారు.

రథసప్తమి సందర్భంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రాధిక

• జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక

శ్రీకాకుళం క్రైమ్: రథసప్తమి వేడుక సందర్భంగా భక్తులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా శ్రీకాకుళం పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం పట్టణంలోని ముఖ్య కూడళ్లను పరిశీలించారు. అరసవల్లి, 80 అడుగుల రహదారి, సూర్యమహల్, ఆర్చి కూడళ్లలో ట్రాఫిక్ మళ్లింపు, నియంత్రణ చర్యలపై అధికారులతో చర్చించారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను కేటాయించి క్రమపద్ధతిలో పెట్టేలా చూడాలని సూచించారు. ఆయా కూడళ్లలో అవసరమైన పోలీసు సిబ్బందిని నియమించి రథసప్తమి వేడుక రోజున భక్తులకు ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. సూర్యనారాయణస్వామి దర్శనం కోసం అధిక సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు ట్రాఫిక్ డీఎస్పీ సీహెచ్‌జీవీ ప్రసాదరావు, ఎస్‌బీ డీఎస్పీ ఎస్.బాలరాజు, సీఐలు లెంక సన్యాసినాయుడు, ఎస్.వి.రమణ, ఎస్సై బలివాడ గణేష్ పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం



చుక్కారావు కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: విధి నిర్వహణలో ఉంటూ మరణించిన పోలీసు కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ఎస్పీ జి.ఆర్.రాధిక భరోసా ఇచ్చారు. జిల్లా పోలీసు శాఖలోని ఆర్మడ్ రిజర్వుడు విభాగంలో పని చేస్తూ చనిపోయిన కానిస్టేబుల్ జి.చుక్కారావు, క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ మరణించిన కానిస్టేబుల్ బి.అప్పలనాయుడుల కుటుంబ సభ్యులను జిల్లా పోలీసు కార్యాలయానికి సోమవారం పిలిపించి ఎస్పీ చేతుల మీదుగా ఆర్థిక సాయం చెక్‌లు అందజేశారు. విడోఫండ్, ఫ్లాగ్ ఫండ్‌లతో కలిపి ఒక్కో కుటుంబానికి రూ. 75 వేల చెక్కును ఇచ్చారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఇతరత్రా బెనిఫిట్స్ త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎస్.బాలరాజు పాల్గొన్నారు.

30 నుంచి కమ్మసిగడాం జాతర



ట్రాఫిక్ నియంత్రణపై కమిటీ ప్రతినిధులతో చర్చిస్తున్న ఎస్సై రాజేష్

రణస్థలం: కమ్మసిగడాం మహాలక్ష్మి తల్లి జాతర ఈ నెల 30, 31, ఫిబ్రవరి ఒకటో తేదీల్లో జరగనుంది. దీంతో జాతర ఏర్పాట్లను జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ సోమవారం పరిశీలించి ట్రాఫిక్ నియంత్రణపై నిర్వాహకులతో చర్చించారు. రామతీర్థాలు వైపు నుంచి వచ్చే వాహనాలను కమ్మసిగడాం జంక్షన్ ముందు, రణస్థలం వైపుగా వచ్చే వాహనాలను లోచర్లపాలెం కూడలి, దేవరాపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలను వెల్బురాయి మిల్లు వద్ద పార్కింగ్ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్సై చెప్పారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడతామన్నారు. సీఐ ఆదాం పర్యవేక్షణలో ట్రాఫిక్ నియంత్రణ, భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్.ఈశ్వరరావు, ఉపాధ్యక్షుడు వెలిచేటి రామకృష్ణ, సభ్యులు వెలిచేటి రాయుడు, తేజ, గోపిన కృష్ణరావు, నడుకుదిటి గిరి ఉన్నారు.

కిడ్నీ రోగులకు వరం రీసెర్చ్ కేంద్రం



సభలో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

• మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు: పలాసలో నిర్మిస్తున్న కిడ్నీ రీసెర్చ్ కేంద్రం, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి రోగులకు వరమని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. అమలపాడు గ్రామంలో సోమవారం నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఉద్దానం ప్రజలను వణికిస్తున్న కిడ్నీ వ్యాధులకు శాశ్వత పరిష్కారం ప్రభుత్వం చూపించిందన్నారు. మరో మూడు నెలల్లో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేలా పని చేస్తున్నామన్నారు. దీనికి కొనసాగింపుగా రూ.700 కోట్లుతో నిర్మిస్తున్న శుద్ధజల పథకం పనులు కూడా చేపడుతున్నట్టు మంత్రి చెప్పారు. హిరమండలం వద్ద వంశధార రిజర్వాయర్‌లో హెడ్‌వర్క్స్ నిర్మించి మెళియాపుట్టి వద్ద నీటిని శుద్ధి చేసే ప్లాంట్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. పలాస నియోజకవర్గంలో గ్రౌండ్ లెవిల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నాలుగు, ఇచ్ఛాపురంలో ఐదు నిర్మించి ప్రతీ గ్రామంలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌లకు నీటిని సరఫరా చేసి ఇంటింటికీ కుళాయి ద్వారా శుద్ధ జలాలు అందిస్తామన్నారు. ఏప్రిల్ నెలలోగా ఈ రెండు ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తాయన్నారు. ఉద్దానంలో కొత్తగా ఎక్కడా కిడ్నీ కేసులు నమోదు కాకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు ముందుకు వేస్తున్నారని మంత్రి అన్నారు.